

www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

మంగళవారం । 31 । మార్చి । 2026


# మత్తుతో యువత చిత్తు

### డ్రగ్స్ రహిత సమాజశీ నిర్మిద్దాం

### "జిల్లా కలెక్టర్, ఎస్పిల నేతృత్వంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన యజ్ఞం"



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం సోమవారం బృందావన్ గార్డెన్ లో మహబూబ్ నగర్ రూరల్, పోలీసు స్టేషన్ పరిధి మహబూబ్‌నగర్ పట్టణం లోని విద్యార్థుల భద్రత దృష్ట్యా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాని జిల్లా ఎస్పి డి.జానకి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మిగతా 2లో..


# ప్రాచీన వారసత్వ కట్టడం నేలకొండపల్లి బౌద్ధ స్తూపం


- బౌద్ధ స్తూపం అభివృద్ధికి కేంద్రం దృష్టి సారించాలి
- జాతీయ బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌లో ఈ ప్రాంతాన్ని చేర్చాలి
- లోక్‌సభలో 377 నిబంధన ద్వారా ప్రస్తావించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం /అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని అభివృద్ధి చేసి జాతీయ బౌద్ధ పర్యాటక సర్క్యూట్ లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి. సోమవారం లోక్‌సభలో 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఈ ప్రాచీన వారసత్వ కట్టడాన్ని సంరక్షించేందుకు తక్షణ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు.

**చారిత్రక ప్రాముఖ్యత ఉన్న బౌద్ధ స్తూపం**

నేలకొండపల్లి బౌద్ధ స్తూపం దక్షిణ భారతదేశంలో ముఖ్యమైన బౌద్ధ వారసత్వ క్షేత్రంగా నిలిచింది. శాతవాహన ఇక్ష్వాకు రాజవంశాల మిగతా 2లో..







తానూర్ మండలం ఎల్వత్-వడోనా గ్రామ శివారులో అక్రమ మొరం తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంతలు

# పట్టేదారుల భూముల్లో మైనింగ్ దందా

- తెలంగాణ సరిహద్దులో మొరం మాఫియా హవా
- సర్వే నం.177లో విస్తృత అక్రమ తవ్వకాలు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు
- చర్యలు తీసుకోవాలంటూ ప్రజల డిమాండ్

**నిర్మల్, అక్షిత బ్యూరో:** తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో మొరం మాఫియా కార్యకలాపాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మల్ జిల్లా మిగతా 2లో..


# చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం

- డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ • జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:** డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,చెడు వ్యసనాలకు దూరంగా ఉండి యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ఇంటర్,డిగ్రీ కళాశాలల విద్యార్థులతో కలిసి చిట్టెం నర్సిరెడ్డి




మెమోరియల్ డిగ్రీ కళాశాల నుండి మెట్రో గార్డెన్ ఫంక్షన్ హాల్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెట్రో ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ఈగల్స్ ఫోర్స్/ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మిగతా 2లో..



# కమ్ముకున్న కారు చీకట్లు

- కట్టకొమ్ములగూడెం జంక్షన్ వద్ద 'కారు 'చీకట్లు
- యమలోకానికి ఇదేనా దారి అని జనం బెంబేలు
- ప్రమాదం పొంచి ఉన్న ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని హైవే దాటుతున్న ప్రజలు
- ఎటువంటి సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయని అధికారులు
- గతంలో ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయిన స్పాట్ ఇదే
- ప్రమాద హెచ్చరిక లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** కోదాడ బైపాస్ రోడ్డులో కట్ట కొమ్ముల గూడెం జంక్షన్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారి నుండి పలు గ్రామాల ప్రజలు కోదాడకు నిత్యం వచ్చి వెళుతుంటారు. చీకటి పడితే ఈ రహదారి గుండా జనం వెళ్లేందుకు జంకుతున్నారు. జంక్షన్ వద్ద రహదారిపై ఎటువంటి లైట్లు మిగతా 2లో..

## ప్రాచీన వారసత్వ కట్టడం
# నేలకొండపల్లి బౌద్ధ స్తూపం

(మొదటి పేజీ తరువాయి)

కాలంలో (క్రీ.శ. 3-4 శతాబ్దాలు) ఇది వికాసం సాధించినట్లు పురావస్తు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. తవ్వకాలలో మహాస్తూపాలు విహారాలు ఇటుక నిర్మాణాలు బుద్ధ విగ్రహాలు రోమన్-భారతీయ నాణేలు వెలుగులోకి రావడం దీని ప్రాధాన్యతను మరింత స్పష్టంచేస్తోంది.

### సదుపాయాల కల్పన అవసరం

ఇంత ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ఈ స్థలం ఇప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతోందని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రహదారులు సూచిక బోర్డులు పారిశుధ్యం భద్రత వంటి మౌలిక సదుపాయాలు లేవని సంరక్షణ లోపంతో నిర్మాణాలు దెబ్బతింటున్నాయని కూడా సూచించారు.

### జాతీయ బౌద్ధ పర్యాటక వలయంలో నేలకొండపల్లిని చేర్చాలి

పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమగ్ర సంరక్షణ చేపట్టాలని స్థలంలో మ్యూజియం మరియు ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే జాతీయ బౌద్ధ పర్యాటక వలయంలో నేలకొండపల్లిని చేర్చితే దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ వారసత్వ కట్టడాన్ని పరిరక్షిస్తూ తెలంగాణలో సాంస్కృతిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

# చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

బాలల సంరక్షణ - మాదకద్రవ్యాల నివారణ (మాదక ద్రవ్యాలకు వద్దు చెప్పండి) అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్, ఎస్పీలు విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే ప్రొజెక్టర్ ద్వారా షార్ట్ ఫిలిం వీడియోలు ప్రదర్శిస్తూ మత్తు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు.యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.తల్లిదండ్రులు మిమ్మల్ని కష్టపడి చదివిస్తున్నారని, వాళ్ళు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థాయిలో నిలవాలని సూచించారు.దేశం మనదే.. తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే అనే దేశ భక్తి గీతం మాదిరిగా .. ఊరు మనదే .. జిల్లా మనదే.. రాష్ట్రం మనదే.. అన్నట్లు మనం డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... స్టేట్ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ ఏడిజిపి సందీప్ శాండిల్య ఐపీఎస్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డ్రగ్స్ వ్యతిరేకంగా విస్తృతంగా దాడులు మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా నేడు డ్రగ్స్ అనేవి ఒక విధంగా టెర్రరిస్ట్‌లాంటివని,ఇవి దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు.యువత ఎక్కువగా ఉన్న భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు అవసరం లేదని,ఆ దేశ యువతను చెడు మార్గంలోకి నెట్టేస్తే చాలు అని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని,అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు.

అందువల్ల విద్యార్థులు, యువత ఈ చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచుతూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా,విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే జీవితాంతం దాని ప్రభావం ఉండే ప్రమాదం ఉందని, అందువల్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులుగా మారాలని పిలుపునిచ్చారు.

అనంతరం డ్రగ్స్ వ్యతిరేక వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, అందరూ కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామాగ్రిలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈగల్స్ ఫోర్స్ డీఎస్పీ పుష్పన్ కుమార్,డీఎస్పీ నల్లపు లింగయ్య, డి ఎం ఎచ్ ఓ జయచంద్రమోహన్, ఆర్ టి ఓ మెగా గాంధీ,ఎక్సైజ్ సీఐ అనంతయ్య, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేష్,గాయత్రి, కృష్ణ చైతన్య, గురవయ్య, ఉపాధ్యాయులు,విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్తుతో యువత చిత్తు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదకర వ్యసనమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలనకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటూ, ప్రత్యేకంగా ఫోర్స్ బృందాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, కుటుంబ సభ్యులతో సాన్నిహిత్యం పెంచుకోవడం, మంచి స్నేహితులతో కలసి క్రీడలు మరియు సానుకూల కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి మార్పు సాధిస్తే సమాజం, రాష్ట్రం, దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని అన్నారు. జిల్లా ఎస్.పి.డి జానకి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఈ వ్యసనానికి లోనైతే వ్యక్తిగత జీవితం, కుటుంబ జీవితం రెండూ దెబ్బతింటాయని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా ఈ అలవాటుకు గురైతే, భయపడకుండా కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించి బయటపడాలని సూచించారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని పిలుపు నిచ్చారు.మాదక ద్రవ్యాలు అమ్మిన వాడిన రవాణా చేసిన వారిపై చట్టరీత్యా శిక్షలు తీసుకోబడును. అలాగే వీరికి ప్రభుత్వం తరఫున రావలసిన ఎలాంటి రాయితీలు కూడా రావని తెలిపారు. ఈగల్ అదనపు ఎస్పి కృష్ణమూర్తి మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయ విధానాలు , వాటి వెనుక ఉన్న నెట్వర్క్ గురించి వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై పోస్టర్లను విడుదల చేశారు. విద్యార్థులందరితో మాదక ద్రవ్యాలు వాడమని ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు క్రీడా సామాగ్రిని జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్, అదనపు జిల్లా వెల్ఫేర్ అధికారి జరీనా,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె కృష్ణ,, డి.ఈ.ఓ ప్రవీణ్ కుమార్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, చైర్మన్ నయీ ముద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పట్టేదారుల భూముల్లో మైనింగ్ దందా

(మొదటి పేజీ తరువాయి)

తానూర్ మండలం ఎల్వత్-వడోనా గ్రామ శివార్లలోని సర్వే నంబర్ 177లో భారీ స్థాయిలో అక్రమ మొరం తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.




సమాచారం ప్రకారం, ఈ సర్వే నంబర్‌లో గతంలో సుమారు 30 మంది పేద పట్టేదారు రైతులకు అసైన్డ్ భూములు కేటాయించ బడినట్లు తెలుస్తోంది. అయితే సాగు సదుపాయాల లేమితో భూములు పాడు బడటంతో, కొందరు స్థానిక ప్రభావశీలులు మరియు రాజకీయ అనుబంధితులు మహారాష్ట్రకు చెందిన మైనింగ్ మాఫియాతో చేతులు కలిపి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌కు సమీపంలో ఉండటం ఈ అక్రమ దందాకు అనుకూలంగా మారిందని చెబుతున్నారు. ప్రతిరోజూ రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు జేసీబీలు, టిప్పర్ల సహాయంతో మొరం తవ్వి సరిహద్దు దాటి తరలిస్తున్నారని గ్రామస్థులు వెల్లడిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల భూములు భారీ గుంతలుగా మారి పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని, ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తవ్వకాల గుంతలో పడి ఒక ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందగా, పశువులు కూడా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని వారు చెబుతున్నారు.

ఈ విషయంపై తానూర్ మండల తహసీల్దార్ మహేందర్ నాథ్ స్పందిస్తూ, ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ అంశాన్ని పై అధికారులకు తెలియజేసినట్లు, అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.అయితే స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పష్టమైన చర్యలు తీసుకోలేదని, మైనింగ్ మాఫియా యథేచ్ఛగా కార్యకలాపాలు కొనసాగిస్తోందని ఆరోపిస్తున్నారు. అధికారుల కదలికలపై ముందుగానే సమాచారం అందుతుండటంతో మాఫియా సభ్యులు సరిహద్దు దాటి పారిపోతున్నారని అంటున్నారు. మామూళ్ల ప్రభావంతో కొందరు అధికారులు ఈ దందాపై కళ్ళుమూస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాత్రింబవళ్లు టిప్పర్ల ద్వారా మొరం రవాణా జరుగుతున్నా సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.



**ధర్మాబాద్ పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో అక్రమంగా ఏసిన మొరం కుప్పలు**

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల స్వయంగా దృష్టి సారించి సర్వే నంబర్ 177లో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ భూసంపదను కాపాడాలని వారు కోరుతున్నారు.

# కమ్ముకున్న కారు చీకట్లు

(మొదటి పేజీ తరువాయి)

వేయకపోవడంతో కారు చీకట్లు కమ్ముకుని ఉన్నాయి. రోడ్డు దాటి జనం ఏమాత్రం పోర పాటు తో ఉన్న నిండు ప్రాణాలు గాలిలో కలిసి పోవాల్సిందే.ఇప్పటికే ఇక్కడ పగలు రాత్రి తేడా లేకుండా అనేక ప్రమాదాలు జరిగాయి. ఎంతోమంది ప్రాణాలు విడిచారు. అయినా అధికారులకు కనువిప్పు కలగడం లేదు. రోడ్డు దాటే మార్గంలో ఎటువంటి లైట్లు వేయలేదు. చిమ్మ చీకటి దాపురించి ఉంది. వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కూడా కనిపించని పరిస్థితి నెలకొని ఉంది. పరిస్థితి చూస్తుంటే యమ దారి ఇదేనా అనిపిస్తుంది. ప్రమాదం జరిగిన తర్వాత హంగు ఆర్భాటం చేసే అధికారులు చిమ్మ చీకట్లు కమ్ముకుని ఉన్న వెలుతురు ఏర్పాటు చేసే ఆలోచనలు చేయడం లేదు. దీంతో జనం ఆ దారి గుండా వెళ్లేందుకు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.

### లైట్లు లేక భయభ్రాంతులకు గురి అవుతున్నాం

**- కన్నెబోయిన నాగేశ్వరరావు**



కోదాడ నుండి కట్ట కొమ్ముల గూడెం వైపుకు, అటు నుండి అనేక గ్రామాల్లో ప్రజలు కోదాడకు నిత్యం వచ్చి పోతుంటారు.

రాత్రిపూట ఆ గ్రామాలకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. జంక్షన్ వద్ద జీఎంఆర్ అధికారులు ఎటువంటి హెచ్చరిక దీపాలు ఏర్పాటు చేయలేదు. వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కూడా కనిపించని పరిస్థితి ఉంది. చిమ్మ చీకట్లు కమ్ముకుని రోడ్డుపై ఏమి కనిపించని పరిస్థితి ఉంది. అధికారులు వెంటనే దీపాలు ఏర్పాటు చేయకపోతే పెద్ద ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది.

### యమలోకానికి దారిగా మారింది..

**- తిపిరిశెట్టి రాజు**



కోదాడ నుండి కట్ట కొమ్ముల గూడెం కు వెళ్లే దారి అనేక ప్రమాదాలు జరిగి యమలోకానికి దారిగా మారింది. గతంలో అనేకమందికి కార్లు లారీలు ఢీకొని ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం ఈ దారి వద్ద ఎటువంటి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. చిమ్మ చీకట్లు కమ్ముకుని ఉన్నాయి. పెద్ద ప్రమాదం పొంచి ఉంది. అధికారులు వెంటనే స్పందించి దీపాలు ఏర్పాటు చేయకపోతే ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఇకనైనా అధికారులు పెద్ద ఎత్తున దీపాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నాం...





## హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**వరంగల్, అక్షిత బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిస్తూ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా హజ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా ప్రారంభించారు. యాత్రికులు ఆరోగ్యంగా, సురక్షితంగా హజ్ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

## దంచికొడుతున్న ఎండలు..

### 22 జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు

**జగిత్యాల అక్షిత బ్యూరో:** రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో తీవ్రమైన వేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివారం 22 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపింది. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో 41.8 డిగ్రీలు, జగిత్యాలలో 41.6




, మంచిర్యాలలో 41.6, కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లిలో 41.5, ములుగు, నిజా మాబాద్‌లో 41.4, నల్లగొండలో 41.3 డిగ్రీలుగా నమోదయ్యాయని వెల్లడించింది. మిగతా 11 జిల్లాల్లో 40 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. మరో నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు ఇలానే ఉంటాయని పేర్కొన్నది.

### నేడే తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

## ఉచితంగా హెల్త్ క్యాంప్

### మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్న డాక్టర్ ప్రత్యూష

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** మార్చి నెల 31న మంగళవారం అంటే నేడే తల్లాడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రత్యూష తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నుండి ప్రముఖ స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరవుతారని,పలు అనారోగ్య సమస్యలు, గైనకాలజీసమస్యలు, కీళ్ల నొప్పులు, చిన్నపిల్లల చికిత్స, సాధారణ



వ్యాధులు, కంటి సమస్యలు, టీబీ లక్షణాల పరిశీలన, ఉచిత రక్త పరీక్షలు, ఉచిత మందులుపంపిణీచేస్తామని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కోరారు.

## కారు, బైక్ ఢీ : వ్యక్తి మృతి

**పెద్ద అడిశర్లపల్లి (గుడిపల్లి) అక్షిత ప్రతినిధి:** కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామంలోని సంజీవని కాలేజ్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అడిశర్లపల్లి మండలం అజ్మాపురం గ్రామానికి చెందిన చెన్నకేశవ గౌడ్ (38) గా గుర్తించారు.తన ద్విచక్ర వాహనంపై కొండమల్లేపల్లి వైపు వెళ్తుండగా, అటుగా వచ్చిన స్విఫ్ట్ కారు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చెన్నకేశవ గౌడ్



అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు.ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఏసీబీకి చిక్కిన తిమ్మాజిపేట ఎస్సై హరిప్రసాద్ రెడ్డి

- రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సంఘటన
- ఏసీబీ డి.ఎస్.పి బాలకృష్ణ

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ఓ వ్యక్తి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఎస్సై పట్టుబడిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. ఒక కేసుకు సంబంధించి ఈనెల 07న ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.30 వేలు డిమాండ్ చేసి రూ. 20వేలు లంచం తీసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట ఎస్సై హరిప్రసాద్ రెడ్డిని సోమవారం మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇసుక కొడుతున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని ఈనెల 5వ తేదీన ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు.మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60వేలు ఫైన్ వేశారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్సైకి ఇచ్చాడు. రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను విడుదల చేస్తాను అని ఎస్సై చెప్పాడు.మైనింగ్ ఫైన్ కట్టడంతో పాటు.. మళ్లీ రూ. 30 వేలు కట్టవలసి రావడంతో వాయిస్ రికార్డింగ్‌లు. 20వేల రూపాయలు చెల్లించిన అంశాలతో ఆ వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అన్ని ఆధారాలతో ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు




చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డి.ఎస్.పి బాలకృష్ణ వెల్లడించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణి దరఖాస్తులు 78

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.అయినప్పటికీ పిరుదులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవిన్స్ లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 33 దరఖాస్తులు, డిఆర్డిఏ 6, డిపిఓ 5, డిడబ్ల్యూఓ 5, మిగిలిన 29 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని కాగా మొత్తం 78 దరఖాస్తులు



వచ్చాయాని తెలిపారు.వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు.ఈ ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామా రావు, సీఈఓ జిల్లా పరిషత్ శిరీష, రెవెన్యూ డివిజన్ అధికారి వేణు మాధవరావు, ఇతర జిల్లా అధికారులు,తదితరులు హాజరయ్యారు.

## బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గట్ల నరసింహారావు విజయం

**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో గట్ల నరసింహారావు ఘన విజయం సాధించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 105 ఓట్లు పోలవ్వగా, నరసింహారావుకు 63 ఓట్లు ఆయన ప్రత్యర్థి ఉయ్యాల నరసయ్యకు 41 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లకుండా పోగా, 22 ఓట్ల మెజారిటీతో నరసింహారావు విజేతగా నిలిచినట్లు ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు, సహాయ అధికారి రామకృష్ణారావులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షుడికి పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శరత్ బాబు, సిలివేరు వెంకటేశ్వర్లు, నవీన్, శ్రీధర్, రహీం, ధనలక్ష్మి, దుర్గా, హేమలత, రంజాన్ పాష,రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేయాలని టీఎన్జీవో నేతలు కలెక్టరకు వినతి

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఇటీవల కాలంలో రాజీవ్ స్వగృహ జలజ ప్రాజెక్టు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హౌసింగ్ సొసైటీ దక్కించు కోగా ఈ ప్రాజెక్టు అనుకొని ఉన్న రిటైనింగ్ వాల్ పనులు ఈ వేసవి కాలం పూర్తి అయ్యే లోపు ముగించి రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కన ఏర్పాటు చేసే రహదారిని మరియు డ్రైనేజీ వ్యవస్థ ను అభివృద్ధి చేయాలని టీఎన్జీవో ఖమ్మం జిల్లా కమిటీ కలెక్టర్ దురిశెట్టి



అనుదీప్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డా.విజయ్ కుమార్ టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాస రావు కొణిదెన శ్రీనివాస్ జిల్లా ట్రెజరర్ వల్లపు వెంకన్న జిల్లా వైస్ ప్రెసిడెంట్ యర్రా రమేష్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్ ఇరిగేషన్ ఫోరం అధ్యక్షులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేయాలి**

**బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు కార్పొరేటర్ సురేష్ జోషి**





**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రతిరోజు ఉదయం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛభారత్ హై హమారా అంటూ ఉదయాన్నే ప్రతి వాడలో నిద్ర లేపుతున్న చెత్త తరలించే బండ్లు, సిబ్బంది వస్తున్నప్పటికీ జనాలు ఇండ్ల మధ్యలో ఉండే ప్లాట్లలో ఖాళీ స్థలాల్లో చిత్తవేయడం పట్ల 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్ జోషి తరచూ చెబుతూనే ఉన్న మరల అలాగే చేస్తున్న నిర్లక్ష్యపు ఇంటివారికి జరిమానా విధిస్తూ సక్రమంగా విధులు నిర్వహించని ఉద్యోగులను మందలించారు.

ఈ సందర్భంగా చెత్త ఆటోలు రోజు వస్తున్నా వాటిల్లో వేయ కుండా ఇంటి పక్కన ఉన్న కాలి ప్లాట్లలో వేస్తున్న ముగ్గురు ఇండ్లకు సంబంధించిన నిర్లక్ష్యపు గృహస్తులకు 10,000 జరిమానా విధించారు. అలాగే విధులు సక్రమంగా నిర్వర్తించని ఉద్యోగులపైన చర్యలు తీసుకుంటామని తమకు సమాచారం అందిస్తే తక్షణ సేవలు తమ అందుబాటులో ఉంటాయని అన్నారు.

నగరంలోని ప్రతి ఇంటివారు ఉదయాన్నే వస్తున్న చెత్త తరలించు వాహనాల్లో చిత్తవేయాలని తడి చెత్త పొడి చెత్త వేరు చేసి వేయాలని అలాకాకుండా కాళీ ప్లాట్లను వేయడం వల్ల, మలేరియా డయేరియా ఫైలేరియా అంటురోగాలు వ్యాప్తి చెందటమే కాకుండా, చెత్త వేరుచేసి వేయకపోవడం వలన వాటిని పశువులు తింటూ ప్రమాదకర వస్తువుల ద్వారా అనారోగ్యాలకు గురవుతున్నాయని ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండాలంటే నగరవాసులందరూ చెత్త ఆటోలో వేరువేరు విభాగాలు చేసి చెత్తను వేయాలని తాను ప్రతిరోజు డివిజన్లోని ప్రతి గల్లీ తిరుగుతున్నానని ఆటోలు రాకపోతే తనకు సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే చెత్తను తరలిస్తామని డివిజన్ ప్రజలకు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ భీమయ్య జవాన్లు పసునూరి సునీత,రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

**పోలీస్ అధికారులను ఆదేశించిన ఎస్పి**



**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ నితిక పంత్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది.

సోమవారం రోజు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత డిఎస్పీ/ఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ లతో ఫోన్ లో ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని, బాధితులు, సమస్యలు ఉన్నవారు ప్రజావాణి కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి




**రామన్నపేట,అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం నాయకులు ప్రభుత్వానికి పలు కీలక డిమాండ్లు వినిపించారు. ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నిజమైన ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల స్థలం, నెలకు రూ.25 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలను ఆదుకోవాలని, ఉద్యమకారులకు రూ.10 లక్షల మెడికల్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.అలాగే ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్ల నిధులతో ఆదుకోవాలని, ఉద్యమకారులపై ఉన్న కేసులను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారుల ఫోరం రామన్నపేట మండలాధ్యక్షులు నోముల శంకర్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్, మండల ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, ఉద్యమ నాయకులు ఎండి ఇమామ్, బోగారం మాజీ ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోనే మృత్యువొడిలోకి చేరిన ఉపాధ్యాయుడు

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. విధులు నిర్వహిస్తూనే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని టూక్యా నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ (46) సోమవారం ఉదయం సాధారణంగా పాఠశాలకు హాజరయ్యారు. తరగతులు నిర్వహిస్తున్న సమయంలో తరగతి గది లోనే అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే ఆయనను నెక్కొండలోని ఆసుపత్రికి తరలించారు. అయితే



అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడు సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందినవారని తెలిసింది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## అనారోగ్యంతో ఉన్న గోపాల్‌కు పరామర్శ

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**నారాయణ పేట,అక్షిత ప్రతినిధి:** దామరగిద్ద మండలం ఉద్మల్ గిద్దకు చెందిన కామ్రేడ్ గోపాల్ ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ టి.సాగర్, రాష్ట్ర నాయకులు ఆర్.వెంకట్రాములు, నారాయణపేట జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామిరెడ్డి, కేవీపీఎస్ మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు కుర్మయ్య, జిల్లా నాయకులు జోషి, కాశప్ప తదితరులు పరామర్శించారు. కామ్రేడ్ గోపాల్‌కి శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లోని సుశ్రుత ప్రజా వైద్యశాలలో అపెండిక్స్



ఆపరేషన్ విజయవంతంగా జరిగింది.ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు గోపాల్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే ఆయనను ధైర్యం చెప్పి,ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోపాల్ మంగళవారం డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని వైద్యులు వెల్లడించారు.

**గడ్డిపల్లి పీఎం శ్రీ మోడల్ స్కూల్‌లో**

## వ్యవసాయ వృత్తి శిక్షణ ముగింపు

**గరిడేపల్లి, అక్షిత ప్రతినిధి:** స్థానిక పీఎం శ్రీ గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన వ్యవసాయ వృత్తిపర శిక్షణ కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన సభలో 2024-25, 2025-26 విద్యాసంవత్సరాలకు చెందిన విద్యార్థులకు వృత్తి శిక్షణ పత్రాలను అందజేశారు. అలాగే 2024-25 బ్యాచ్ విద్యార్థులకు రూ. 1,000 చొప్పున ఉపకార వేతనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. వ్యవసాయ విద్య కేవలం ఉపాధిని మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేసే గొప్ప సంతృప్తిని కూడా ఇస్తుందని పేర్కొన్నారు.



అనంతరం వృత్తి శిక్షణ ఉపాధ్యాయులు టి.శ్రీను మాట్లాడుతూ, వ్యవసాయం సమాజానికి తోడ్పడుతూ ఆరోగ్యాన్ని, ఉపాధిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి. నాగరాజు, డాక్టర్ కందుల శివకృష్ణ, చిన్న బాలయ్య, విష్ణువర్ధన్, శాంతిప్రియ, దామ్లా, మల్లికార్జున్ రెడ్డి, రమేష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడ మైదానాన్ని అభివృద్ధి చేయాలి

### జిల్లా కలెక్టర్ కె.హరితకి డివైఎఫ్ఐ నాయకుల వినతి

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** జిల్లా కేంద్రంలో జనకాపూర్ వద్దగల క్రీడామైదననీ అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ హరిత గారికి డివైఎఫ్ఐ కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టీకానంద్ గోడిసెల కార్తీక్ మాట్లాడుతూ గతంలో క్రీడా మైదానం అభివృద్ధి కొరకు దాదాపు 22 లక్షల రూపాయలతో నిధులు మంజూరు చేసి ఒక కాంట్రాక్టర్ కి




అభివృద్ధి పనులు అప్పగించారు సదురు కాంట్రాక్ట్ కొంతమేరకు పనులు చేసి ఆపేశారు అన్నారు జిల్లాలో అనేకమంది క్రీడాకారులు క్రీడలలో నైపుణ్యం కలిగి ఉన్నప్పటికీ సరైన క్రీడ మైదానం లేక క్రీడకారులు మరియు యువత ఇబ్బందులు పడుతున్నారు అన్నారు కబడ్డీ వాలీబాల్ ఖో ఖో క్రికెట్ లో నైపుణ్యాలు ఉన్నప్పటికీ సరైన క్రీడమైధనం లేక రాష్ట్రస్థాయి జాతీయస్థాయి అంతర్జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారులు పై స్థాయి కి వెళ్లలేక నష్ట పోతున్నారు అన్నారు క్రీడ మైదానంలో త్రాగునీటి సౌకర్యం విద్యుత్ సౌకర్యం విశ్రాంతి గది రన్నింగ్ ట్రాక్ కబడ్డీ వాలీబాల్ ఖో ఖో కోర్టులో ఏర్పాటు చేసి . పిచ్చి మొక్కలను తొలగించాలని అన్నారు మందుబాబులకు అడ్డగా మారిన క్రీడ మైదానాన్ని కి నైట్ వాచ్మెన్. రాత్రిపూట పోలీసుల పరవేక్షణ ఉండేటట్లు చూడాలని కోరారు సానుకూలంగా స్పందిస్తూ జిల్లా కలెక్టర్ అన్ని విధాలుగా క్రీడ మైదానాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టీకానంద్ కార్తీక్ కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం

**మహబూబ్‌నగర్,అక్షిత ప్రతినిధి:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా కలెక్టర్ కార్యాలయం లో ప్రత్యేక వైద్య శిబిరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక రోజు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ వైద్య శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపు



ణులు, జనరల్ మెడిసిన్, ప్రసూతి & గైనకాలజీ, కంటి వైద్యం, మహిళల ఆరోగ్య నిపుణులు తదితర విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని కలెక్టరేట్ సిబ్బంది మరియు సాధారణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించారు. శిబిరంలో భాగంగా కలెక్టరేట్ ఉద్యోగులకు,కలెక్టర్ కార్యాలయం ప్రజావాణి కార్యక్రమం కు వచ్చిన అర్జీ దారులు,ప్రజలకు

రక్తపోటు ,షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రత్యేక ఆరోగ్య శిబిరం ను సందర్శించి వైద్య పరీక్షలు గురించి తెలుసుకున్నారు

అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక వైద్య క్యాంపును సద్వినియోగం చేసుకుని ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించుకుని డాక్టర్ల సలహాలు, మందులు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ వైద్య శిబిరాన్ని సందర్శించి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది సేవలను వారు అభినందించారు.





# పిల్లలకు చదువు అందించడం ద్వారానే ఉజ్వల భవిష్యతు

### - వరంగల్ సిపి



**వరంగల్,అక్షిత ప్రతినిధి:** చదువు చెప్పించడం ద్వారా వారి భవిష్యత్తుతో పాటు చదువుకునే పిల్లల్లో ఆనందాన్ని చూడొచ్చుని వరంగల్ సీపీ తెలిపారు. సోమవారం ఫోర్ట్ వరంగల్ మండలంలోని గుంటూరు పల్లి మండల ప్రాథమిక పాఠశాల లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వరంగల్ పోలీస్ కమిషనరేట్,ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలకు కమిషనర్ చేతుల మీదుగా ఎడ్యుకేషనల్ సామాగ్రి, యూనిఫార్మ్ పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనేది పోలీసు వివిధ ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జరుగుతుందనీ కార్యక్రమంలోనే భాగంగా స్కూలు బయట ఉన్న పిల్లలందరినీ గుర్తించి తప్పనిసరిగా స్కూల్లో చేర్పించాల్సిన అవకాశం ఉందని తెలిపారు అందులో భాగంగానే వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి కొరకు ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కుటుంబాలలోని పిల్లలకు సరైన విద్యా అవకాశాలు లేకుండా ఉన్న 120 బాలలను గుర్తించి వారిని అందర్నీ పాఠశాలల్లో చేర్పించడం జరిగిందనీ. ఈ పిల్లలకు సరైన విద్య అందుటకు కు ప్రత్యేకమైన టీచర్స్ ను యూనిఫాం, బుక్స్ బ్యాగులు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సహకారంతో ఇప్పించడం జరుగుతుందని ఇందుకుగాను పోలీసు విభాగాన్ని ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగాన్ని, సంస్థ వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీ రవి, మామునూరు ఏసిపి వెంకటేష్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ శ్యాం సుందర్, ఎస్సై సుధాకర్లు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పనిలో చేర్చుకోరాదని అలా చేస్తే చట్టపరంగా శిక్షించబడతారని అన్నారు.

కార్యక్రమంలో సర్పంచి శ్రీకాంత్, నరేష్ ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ ,ఎర్ర శ్రీకాంత్, కుమ్మరి రవికుమార్, ఐ,జే,ఎం కోఆర్డినేటర్ డాక్టర్ ఆనంద్, సిడబ్ల్యుసి చైర్పర్సన్ వసుధ, డిసిపిఓ ఉమా, వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొని బాధిత చిన్నారులకు బడి బ్యాగులు ఇతర వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

# ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసు ఛేదన

**ఆసిఫాబాద్,అక్షిత ప్రతినిధి:** ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక హత్య కేసును కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్ ప్రత్యేక శ్రద్ధతో కేసును పునః పరిశీలన చేయుటకు ప్రత్యేక పోలీస్ టీమ్ ను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ఎస్పీ పర్యవేక్షణలో, కేసు పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకొని, నిందితులను ఛేదించడంలో సఫలీకృతు లయ్యారు.

### కేసు వివరాలు:

2022 సంవత్సరంలో పెంచికల్పేట్ మండలానికి చెందిన సాగర్ అనే వ్యక్తి ఆసిఫాబాద్ నుండి గుండి గ్రామానికి వెళ్లే దారిలో శవమై కనిపించగా దాన్ని అనుమానస్పద మరణంగా పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి హత్యగా నిర్ధారించారు. ఆ హత్య కేసు నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉండెను అట్టి కేసును జిల్లా ఎస్పీ నితికా పంత్, నేతృత్వంలో ఆసిఫాబాద్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, ఐటి కోర్ కానిస్టేబుల్ మహేష్‌లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి, వారికి తగిన సూచనలు ఇచ్చి దర్యాప్తు కొనసాగించారు. విధి నిర్వహణలో చాకచక్యం, సాంకేతిక మాధ్యమాల ద్వారా ఆధారాలు సేకరించి నిందితులను గుర్తించి విచారణ చేపట్టారు.

### నిందితుల వివరాలు

A1: కొండూరి మల్లేశ్వరి, భర్త: స్వామి, వయస్సు: 41 సంవత్సరాలు, కులం: బెస్త, వృత్తి: దీజ బాయ్స్ హాస్టల్ (కౌటాల)లో కుక్, నివాసం: తాళ్లపేట్ గ్రామం, దండేపల్లి మండలం, మంచిర్యాల జిల్లా.

A2: ఎన్నం అశోక్, తండ్రి: లక్ష్మయ్య, వయస్సు: 36 సంవత్సరాలు, కులం: పద్మశాలి, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ద్వారకా నగర్, కాగజ్‌నగర్ మండలం – పరారీలో ఉన్నాడు

A3: చెన్నూరి స్వామి ఏ తిరుపతి, తండ్రి: లచ్చయ్య, వయస్సు: 27 సంవత్సరాలు, కులం: పద్మశాలి, వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం: ఆగర్ గూడ గ్రామం, పెంచికల్పేట్ మండలం.

### హత్యకు కారణం:

ప్రధాన నిందితురాలైన మల్లిశ్వరీ కుమార్తెతో, బాధితుడు మాట్లాడుతున్నాడనే అనుమానం మరియు వ్యక్తిగత విభేదాల కారణంగా నిందితులు ముందుగానే పథకం వేసి హత్య చేశారు.

### నేర విధానం:

నిందితులు సాగర్‌ను కాగజ్‌నగర్‌కు రమ్మని పిలిచి, ఆటోలో ఎక్కించి ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామ శివారులోని పంట పొలాల వద్దకు తీసుకెళ్లి, దాడి చేసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం అక్కడి నుండి పరారయ్యారు.

### అరెస్టు మరియు తదుపరి చర్యలు:

సాంకేతిక మాధ్యమాల ద్వారా ఆధారాలు సేకరణ మరియు విచారణలో నిందితులు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పరచి



రిమాండ్‌కు పంపించారు. పరారీలో ఉన్న ఎ2 నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది.

### కేసు చేదనలో కృషిచేసిన పోలీసులను అభినందించిన ఎస్పి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హత్య కేసు చేదనలో కృషిచేసిన ఆసిఫాబాద్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్, కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, ఐటి కోర్ కానిస్టేబుల్ మహేష్ లను ఎస్పీ నితిక పంత్ ప్రత్యేకంగా అభినందించారు.

# దళిత బంధు నిధులు విడుదల చేయాలి

## - జిల్లాకలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి

**యాదాద్రి భువనగిరి అక్షిత న్యూస్:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన దళిత బంధు నిధులను విడుదల చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని మోత్కూర్, అడ్డగూడూర్ మండలాల లబ్దిదారులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. మోత్కూర్ అడ్డగూడూర్ గ్రామాలకు చెందిన 254 మంది దళితులకు రెండో విడతలో రూ.3 లక్షలు జమ చేసినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా మిగతా నిధులు నిలిచిపోయాయని తెలిపారు. రెండున్నరేళ్లుగా పలుమార్లు కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ మరియు ఈడి అధికారిని కలిసినా స్పందన లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆధార్ నమోదుతో దళిత బంధు లబ్ధిదారులుగా చూపుతూ ఇతర సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రం లోని ఇతర నియోజకవర్గాల్లో నిధులు విడుదల చేస్తున్నప్పటికీ తుంగతుర్తి నియోజకవర్గాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు.

పేదరికంలో జీవిస్తున్న తమకు తక్షణమే గ్రౌండింగ్ పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు లబ్ధి దారులు బాలెంల నరేందర్ ఇటుకాల ఆంజనేయులు జిల్లా శివాజీ జక్కుల గిరిబాబు చెడిపల్లి రఘుపతి అల్వాల శంకర్ బందెల శీను ఇరుగు లక్ష్మణ్ నీలం నరేష్ ఎలిజాల అశోక్ బోనాల మహేందర్ చెరుకు మధు సందీప్ జెడ శీను కడియం నాగయ్య బట్ట వెంకటయ్య గంధ మల్ల



నాగరాజు బోడ వెంకన్న బోడ వెంకన్న మంద విష్ణు బోడయ్యగిరి బోడ వెంకటయ్య బోడ సామిల్ వడ్డే యాదగిరి మందుల యాదగిరి గూడెం సుభద్ర గూడ పరమేష్ ఈదుల శీను బాలయంల సోమయ్య బుల్లెట్ల రవి సూరారం రాజు, కొంపల్లి అంజయ్య మోత్కూర్ చిటికులయ్య కొంపల్లి రమేష్ ఈదుల నరేష్ బందెల కిష్టయ్య చిప్పలపల్లి అంజయ్య చిప్పలపల్లి సైదులు



సూరారం బిక్షం దాసరి నరేష్ చిప్పలపల్లి సందీప్ చింత వెంకన్న చుక్క వెంకన్న రాంపాక కరుణాకర్ బండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులను క్షేత స్థాయిలో పరిశీలన చేసి సత్వరమే పరిష్కారమయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఏం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు వివిధ సమస్యలపై వచ్చే ధరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. తిర్యాని మండలం ఎదులపాడ్ గ్రామ సర్పంచ్ మాడావి పార్వతి, తమ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న అరటి పల్లి గ్రామంలో అంగన్వాడి భవనం నిర్మాణం చేపట్టాలని ధరఖాస్తు. ఆసిఫాబాద్ పట్టణం జన్కాపూర్ ఆర్.ఎస్.ఆర్ కాలనీకి చెందిన సేండే మోతిరాం, తనకు వస్తున్న పింఛను జన్కాపూర్ కు బదిలీ చేయాలని ధరఖాస్తు. తిర్యాని మండలం మొర్రి గూడ గ్రామానికి చెందిన కట్కక హనుమంతరావు తనకు దివ్యాంగుల పింఛను మంజూరి గురించి ధరఖాస్తు. కాగజ్ నగర్ పట్టణం విజయనగర్ కాలనీకి చెందిన మహమ్మద్ ఖాజా తనకు వస్తున్న పింఛను నిలుపుదల అయినందున



పున:రుద్ధరించగలరని ధరఖాస్తు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన గడిగోపుల మాన్విత్ తన తండ్రి ఉద్యోగం చేస్తూ మరణించినందున తనను కారణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించుట గురించి ధరఖాస్తు. కౌటాల మండలం బాదం పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి సంస్కృతి, తాను కాన్పూర్ ఐ.ఐ.టీ లో ప్రథమ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నందున లాప్టాప్ మంజూరి చేయుటకు ధరఖాస్తు. రెబ్బెన మండలం తక్కల పల్లి గ్రామానికి చెందిన టేకం బుజంగ్ రావు తనకు జారీ చేసిన భూమి పట్టా బుక్కులో 1.శీశీ ఎకరం భూమి తక్కువగా నమోదైనందున సవరణ గురించి ధరఖాస్తు.

ఈ ప్రజావాణిలో అధికారులు, ధరఖాస్తు దారులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలి



## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు సూదన్ నాయక్ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సోమవారం మహబూబ్ నగర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పర్యటించారు.గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై మల్టీ పర్పస్ వర్కర్‌లతో మాట్లాడి పంచాయతీ కార్యదర్శికి ఆయన సూచనలు చేశారు. నర్సరీని పరిశీలించారు. నర్సరీ నిర్వహణపై సూచనలు చేశారు.



## స్మార్ట్ కిడ్జ్‌లో ఇంటర్నేషనల్ ఒలంపియాడ్

# విజేతలకు బహుమతుల ప్రధానం

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మం స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఇంటర్నేషనల్ ఒలంపియాడ్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం మెడల్స్ ప్రధానం చేశారు. ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు గణితం సైన్స్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్షలను గతంలో నిర్వహించారు. ఈ ఒలంపియాడ్స్ లో 60 మంది చిన్నారులు తమ ప్రతిభ పాఠవాలతో విజేతలుగా నిలవడంతో సోమవారం పాఠశాలలో జరిగిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో చిన్నారులకు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మెడల్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులను అన్ని రంగాలలో వ్యక్తిగత శ్రద్ధతో నిరంతరం ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. అంతర్జాతీయ జాతీయ రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి పోటీలలో తమ పాఠశాల చిన్నారులు విజేతలుగా నిలిచి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నారని తెలిపారు. గణితం సైన్స్ ఇంగ్లీష్ విభాగాలలో అత్యున్నత ప్రతిభావంతులుగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 167



ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరి ప్రియ,డి ఆర్.ఓ రాంరెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.జిల్లా కలెక్టర్ దరఖాస్తు దారులతో మాట్లాడుతూ వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చర్చించి అర్జీలను పరిశీలించి సమస్య ను పరిష్కారం చేయాలని ఆదేశించారు

పెండింగ్ లో నున్న అర్జీలను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి,డి.ఆర్.డి. ఓ నర్సింహులు

వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అవార్డులు అధికారుల కృషికి కొలమానాలు

### - మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశంస

**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** ఇటీవలే నిర్మల్ జిల్లాకు రెండు స్కోచ్ అవార్డులు లభించినందున, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాదులో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు రెండు విభాగాల్లో స్కోచ్ అవార్డులు లభించడం ఎంతో



గర్వకారణం అని మంత్రి ప్రశంసించారు. పోనికివనం, ఏర్పాటు అమ్మ రక్షిత కార్యక్రమం అమలు విజయవంతంగా కొనసాగిస్తున్నందుకు అధికారులను మెచ్చుకున్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లాలో వినూత్న కార్యక్రమాలు అమలుపరిచేందుకు ప్రోత్సాహం అందిస్తూ, మార్గ నిర్దేశం చేసిన ముఖ్యమంత్రికి, మంత్రి జూపల్లి, సీతక్క, దామోదర రాజనరసింహ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు

# క్రీడల్లో రాణించాలి

### - జిల్లా కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో జాతీయ స్థాయికి ఎదిగి జిల్లా పేరును నిలబెట్టాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠ శాలలో నిర్వహిస్తున్న అశ్విత జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో గెలిచిన







క్రీడాకారులకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి అష్ఫాక్ అహ్మద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడాకారులకు కొదవ లేదన్నారు. సరైన శిక్షణ అందిస్తే జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారని అన్నారు. గిరిజన క్రీడాకారులు చాలా చురుకుగా ఉంటారని శిక్షకులు వారికి సరైన శిక్షణను అందించాలన్నారు. ఈ సంవత్సరం హైదరాబాదులోని హాకిం పేట క్రీడా పాఠశాలలో జిల్లా నుండి ఎక్కువమంది ప్రవేశాలు పొందాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మేమొంటోలు ప్రధానం చేశారు.

ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి మడావి శేఖు, పిజికల్ డైరెక్టర్లు, క్రీడా కారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పక్కకు పెడితే

# గత పాలకుల గతే పడుతుంది

### కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలి

### ఉపాధి హామీపై బీజేపీ దాడిని తిప్పి కొట్టాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి డిమాండ్




**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి తీవ్రస్థాయిలో హెచ్చరించారు.సోమవారం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రం నుండి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ముందు మహా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు పూర్తైనప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. రైతాంగానికి పూర్తి స్థాయిలో నేటికీ రుణమాఫీ చేయలేదని ఆరోపించారు.రైతు భరోసా ఎకరాకు రూ.15 వేల ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది రైతాంగానికి ఇచ్చే పెట్టుబడి సహాయం కేవలం ఎకరాకు రూ. 6000 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నిలువున మోసం చేసిందని ఎద్దేవా చేశారు.

పేదలందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇల్లు కట్టిస్తుందన్నారు.గృహ నిర్మాణ శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి కేవలం తన హుజూర్ నగర్ నియోజకవర్గంలో మాత్రమే ఇల్లు నిర్మిస్తున్నారు తప్ప సూర్యాపేట జిల్లాలో ఏ ఒక్క గ్రామంలో ఇంటి నిర్మాణం చేపట్టడం లేదని,ఆయన హుజూర్ నగర్‌కి మాత్రమే మంత్రినా అని ప్రశ్నించారు.అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీపై బిజెపి ప్రభుత్వం దాడి చేస్తూ కూలీల నోటిలో మట్టి కొట్టేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకాన్ని ప్రవేశపెట్టడం సరికాదన్నారు.ఉపాధి హామీని పాత పద్ధతిలోని కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఏడాదికి 200 రోజులు పనులు కల్పించి,రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు.ఆశ,అంగన్వాడి, మధ్యాహ్న భోజనం వంటి స్కీం వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళన కారులను పోలీసులు అడ్డుకున్నారు.కలెక్టర్ రావాలని ప్రజా సమస్యలు పరిష్కరించాలని నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అందుకు కాసేపు పోలీసులకు,నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది.అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ కు సమర్పించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నా కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు,మట్టిపెల్లి సైదులు,కోట గోపి,చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జిల్లపల్లి నరసింహారావు,ధనియాకుల శ్రీకాంత్,వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి,మద్దెల జ్యోతి, కందాల శంకర్ రెడ్డి,మేకనబోయిన శేఖర్,దండ వెంకటరెడ్డి,బుర్ర శ్రీనివాస్,కొప్పుల రజిత,ఎల్గూరి గోవింద్,పల్లె వెంకటరెడ్డి,యాకుబ్, పాండు నాయక్,షేక్ సైదా,వజ్జే శ్రీనివాస్,సుందరయ్య,జహంగీర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### -జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ అక్షిత బ్యూరో:** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.

సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు.

ఈ సందర్భంగా (232) ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈనాటి గ్రీవెన్స్ లో వచ్చిన వాటిల్లో కొన్ని అర్జీల వివరాలిలా ఉన్నాయి. ఘనపూర్ (స్టేషన్) మండలం, స్థానికంగా నివాసం ఉంటున్న ఆర్. దీనమ్మ, రెవెన్యూ శాఖకు సంబంధించి తన తండ్రి పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఎకరం 36 గుంటల భూమిని తన పేరు మీదకు మ్యుటేషన్ చేసి కొత్త పట్టదారు పాస్ బుక్ ఇవ్వగలరని మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

సంజయ్ నగర్ కు చెందిన ఆర్. సరిత, స్థానిక 16వ వార్డులో గత పది సంవత్సరాలుగా కిరాయికి ఉంటున్నారని, తమకు ఎటువంటి ఇల్లు లేదని, ఖాళీ స్థలం ఉందని, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా ఇంటికి వచ్చి ధ్రువీకరించారని, ఎల్1 జాబితాలో ఉండగా, కానీ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, ఈ విషయమై ఇందిరమ్మ ఇల్లు ఇప్పించుటకు ఆర్జీ ద్వారా కోరారు. ఘనపూర్ (స్టేషన్) మండలం, స్థానికంగా నివాసం ఉంటున్న గీతాదేవి రాథోడ్, 2019వ సంవత్సరంలో 623.25 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేయగా, ఇప్పుడు తమ కుటుంబ అవసరాల నిమిత్తం అమ్మకానికి చూడగా హౌస్ సైట్స్ అని చూపిస్తుందని, రిజిస్ట్రేషన్ కావడం లేదని, ఈ





విషయమై తగు విచారణ జరిపి, తమకు న్యాయం చేయగలరని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం సమర్పించనైనది.

తమ్మడపల్లి గ్రామం, జఫర్గడ్ మండలానికి చెందిన రంగు సారంగపాణి, కల్లు గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 50 ఏళ్లుపై బడిన వారికి రూ. 2000 పింఛను ఇస్తోందని, తను కూడా దరఖాస్తు చేసుకోగా పింఛను రావడం లేదని, ఈ మేరకు పింఛను ఇప్పించగలరని కోరుతూ దరఖాస్తును సమర్పించినారు.

ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



**నిర్మల్, అక్షిత ప్రతినిధి:** ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్లకు సమర్పించారు.

ఈప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సర్వేయర్‌లకు సర్టిఫికెట్‌లను అందజేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్,అక్షిత ప్రతినిధి:**

జిల్లాలో 52 రోజుల శిక్షణ పొంది 40 రోజుల అప్రెంటిస్ పూర్తి చేసి పరీక్షలో ఉత్తీర్ణత సాదించిన రెండవ బ్యాచ్‌కు చెందిన 80 మంది లైసెన్స్డ్ సర్వేయర్ లకు సర్టిఫికెట్‌లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందచేశారు. అదే విధంగా మొదటి బ్యాచ్‌లో పరీక్ష పెయిలై సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణులైన 20 మందికి కూడా సర్టిఫికెట్‌లు అందచేశారు. కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరి ప్రియ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి.అశోక్, సూపరిండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు



# కొత్త తండాకు రోడ్డు సౌకర్యం దశాబ్దాల కల నెరవేరింది

### ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో అభివృద్ధి ప్రతి వాడలో జరగాలి

### ఎమ్మెల్యే మందుల సామేలు సహకారంతో త్వరలోనే బీటీ రోడ్డుగా మారుస్తా

### సమిష్టి కృషితో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది

### మామిడిపల్లి గ్రామ సర్పంచ్ అంబటి శ్రీనివాస్





**నాగారం, అక్షర న్యూస్:** మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఒక అభివృద్ధి ఘట్టం ఆవిష్కృతమైంది. గ్రామ పరిధిలోని కొత్త తండాకు గత ఐదు దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేక తండావాసులు అనేక ఇబ్బందులు పడుతూ జీవనం సాగించడం ఎంతో బాధాకరం. మట్టి దారులే ఆధారంగా జీవనం కొనసాగించిన ప్రజలు వర్షాకాలంలో మురుగునీటిలో మునిగి పోయే దారుల్లో నడవాల్సి వచ్చేది. చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లడమే కష్టంగా మారేది. గర్భిణీలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు తరలించడం ప్రాణాపాయంగా మారిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తండావాసుల జీవితం కష్టాల మయంగా మారింది. ఈ సమస్యను తన గుండెల్లో పెట్టుకున్న గ్రామ సర్పంచ్ అంబటి శ్రీనివాస్ మట్టి రోడ్డు నిర్మాణం చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా మామిడిపల్లి గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించడం నా బాధ్యత అని, గ్రామంలోని ఏ మూలనైనా అభివృద్ధి చేరకపోతే అది నిజమైన అభివృద్ధి కాదని నేను నమ్ముతానని తెలిపారు. కొత్త తండా ప్రజలు ఇంతకాలం ఎదుర్కొన్న ఇబ్బందులు తనను ఎంతగానో కలిచివేశాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చడం తన ధర్మమని స్పష్టం చేశారు. మాట ఇచ్చిన తర్వాత దాన్ని నిలబెట్టుకోవడం నా వ్యక్తిత్వం అని ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం నేను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని అన్నారు. తండాలోని పరిస్థితులను స్వయంగా పరిశీలించిన అనంతరం వెంటనే చర్యలు చేపట్టి మట్టి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణంలో తండాలో కొత్త జీవం పోసుకున్నట్టు అయిందని, ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం తనకు నిజమైన ఫలితం అని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం పెద్ద పనులు మాత్రమే కాదని, చిన్నచిన్న అవసరాలను తీర్చడం ద్వారా ప్రజల జీవితాల్లో పెద్ద మార్పులు తీసుకురావడం ముఖ్యమని తెలిపారు. రోడ్డు అనేది కేవలం ఒక మార్గం మాత్రమే కాదని, అది విద్యకు, వైద్యానికి, ఉపాధికి, అభివృద్ధికి దారితీసే ప్రాణాధారం అని తెలిపారు. ఒక గ్రామానికి సరైన రోడ్డు ఉంటేనే ఆ గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, ఈ రోడ్డు వల్ల పిల్లలు ఇకపై సురక్షితంగా పాఠశాలలకు వెళ్లగలుగుతారని, రైతులు తమ పంటలను సమయానికి మార్కెట్ కు తరలించగలుగుతారని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం ఒక్క వ్యక్తి వల్ల సాధ్యం కాలేదని, గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, యువత, తండా ప్రజలు అందరూ కలిసి పనిచేయడంతోనే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. సమిష్టి కృషి ఉంటే ఏ పని అయినా సాధ్యమే అని మన గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇకపై తండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఇంకా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని తెలిపారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు సహకారంతో ఈ మట్టి రోడ్డును త్వరలోనే బీటీ రోడ్డుగా మారుస్తానని, గ్రామంలోని ప్రతి వాడకు సమానంగా అభివృద్ధి అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. త్రాగునీరు, వీధి దీపాలు, కాలువలు, పాఠశాల సౌకర్యాలు వంటి మరిన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. కొత్త తండా ప్రజలు ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, మా సమస్యను ఇంత త్వరగా పరిష్కరించిన గ్రామ సర్పంచ్ అంబటి శ్రీనివాస్ కు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, మేము ఎన్నో సంవత్సరాలకు ఎదురుచూసిన ఈరోజు వచ్చిందంటే అది ఆయన కృషి వల్లే సాధ్యమైందని సర్పంచ్ కు ధన్యవాదాలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు.

# గుండాలలో ఆశా వర్కర్ల నిరసన

### వేతనాల పెంపుపై మాట తప్పిన ప్రభుత్వం

### పని భారం, వేతనాలు పెంచకపోవడం

**గుండాల/అక్షిత న్యూస్:** గుండాల మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వద్ద మండుటెండలో బి ఆర్ టి యు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సోమవారం నిరసన తెలిపారు. తమ డిమాండ్ల




సాధనకై స్థానిక గుండాల ఆరోగ్య కేంద్రం వద్ద ముట్టడికి యత్నించి అక్కడే బైఠాయించారు.

ఈ సందర్భంగా పలువురు ఆశా వర్కర్స్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం వెంటనే అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆశాల అన్ని సమస్యల పరిష్కారానికి ఎన్‌హెచ్‌ఎం కింద తగిన నిధులు కేటాయించాలన్నారు. ఆశా వర్కర్లపై పెరుగుతున్న పనిభారం తగ్గించి, అదనపు భత్యాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు.

గర్భిణీలు, శిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశాలకు ప్రత్యేక గౌరవ వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (బిఆర్‌టియూ) యూనియన్ గుండాల ఆశా వర్కర్స్ కమిటీ డిమాండ్ చేసింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాసం శోభ,రమ,సుజాత,మహేశ్వరీ, రేణుక, భాగ్యలక్ష్మి, నాజమ, సరిత, వీరాలక్ష్మి, శోభ, అంజమ్మ, నవనీత, కళమ్మ, యాదాలక్ష్మి, కవిత, లావణ్య, భాగ్యమ్మ ,జయలక్ష్మి, సుమలత,తదితరులు పాల్గోని నిరసన వ్యక్తం చేశారు.

### ఏప్రిల్ 2న గ్రామ సభలకు అధికారులు

# తప్పనిసరిగా హాజరు కావాలి

### - జిల్లా కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** 30 ఏప్రిల్ 2న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిశీచే గ్రామ సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి అదనప కలెక్టర్ ఏం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన





99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న ప్రతి గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. సర్పంచుల అధ్యక్షతన నిర్వహించే గ్రామసభలలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామ సభలో వచ్చే వివిధ సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. గ్రామ సభలో అవసరమైన షామియని, త్రాగు నీరు, అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ సభలను విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.